ఘనంగా శ్రీరామానుజాచార్య జయంతి వేడుకలు



పూజలు అందుకున్న శ్రీరామానుజాచార్యులు

కొమ్మాది : స్థానిక అన్నంరాజునగర్‌లో గల శ్రీ అష్ట లక్ష్మి దేవాలయంలో ఆదివారం శ్రీ రామానుజాచార్య 1007 జయంతి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా రామానుజాచార్యులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అష్టోత్తర శతనామార్చన, పారాయణ నిర్వహించారు. వైష్ణవ సాంప్రదాయానికి చాలా ముఖ్యమైన మహోన్నత ఆచార్యులు రామానుజాచార్యులని ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర స్వామి భక్తులకు తెలిపారు.

18న మార్షల్ ఆర్ట్స్‌పై ఇంటర్నేషనల్ సెమినార్



విద్యార్థులతో ఆల్ ఇండియా మార్షల్ ఆర్ట్స్ చీఫ్ ఎగ్జామినర్ అండ్ కోచ్ నరసింహారావు

తగరపువలస : జపాన్‌కు చెందిన 10వ డాన్ బ్లాక్ బెల్ట్ గ్రహీత తకాషి మసూయమి ఆధ్వర్యంలో అక్కడి మార్షల్ ఆర్ట్స్ షోలీ టైటిల్‌కు సంబంధించి ఈ నెల 18న విశాఖ పోర్ట్ స్టేడియంలో ఇంటర్నేషనల్ సెమినార్ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు ఆదర్శనగర్‌లోని పీఎస్ఆర్ మార్షల్ ఆర్ట్స్ వేసవి శిక్షణ శిబిరంలో ఆల్ ఇండియా మార్షల్ ఆర్ట్స్ చీఫ్ ఎగ్జామినర్ అండ్ కోచ్ పి.నరసింహారావు ఆదివారం తెలిపారు. బ్రౌన్, బ్లాక్ బెల్టులు కలిగిన 150 మందికి ఈ సెమినార్‌లో ప్రవేశం ఉంటుందన్నారు. 19న అక్కడే నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

35 ఏళ్లుగా వేసవి శిక్షణ శిబిరం

పీఎస్ఆర్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ తరఫున విశాఖ, విజయనగరం, భీమిలి, పోలిపల్లి, ఎలమంచిలి తదితర ప్రాంతాల్లో ఏటా వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. తగరపువలసలో బ్లాక్ బెల్ట్ గ్రహీత బంగారు పరదేశి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిబిరానికి 35 ఏళ్లు నిండాయన్నారు. 45 రోజులపాటు జరిగే ఈ ఉచిత శిక్షణకు పరదేశి సొంతంగా చిన్నారులకు పాలు, గుడ్లు, బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేస్తున్నారన్నారు. కోచ్‌లు బంగారు గౌతమ్, కర్రి చిట్టిబాబు పాల్గొన్నారు.

తరలిరండి... చైతన్యంతో ఓటేయండి



చిట్టివలస హైస్కూల్ వద్ద బస్సు నుంచి పోలింగ్ మెటీరియల్‌తో దిగుతున్న ఎన్నికల సిబ్బంది



బంగ్లామెట్ట పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఏసీపీ ఫకీరప్ప

- నియోజకవర్గంలో 359 కేంద్రాల ఏర్పాట్లు
- పోలింగ్ నిర్వహణకు సర్వం సిద్ధం

ప్రజాస్వామ్య పండగకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సార్వత్రిక ఎన్నికల సంగ్రామంలో ఓటర్లు తీర్పు చెప్పేందుకు అధికారులు సర్వం సమకూర్చారు. రాష్ట్రంలోనే అతి పెద్దదైన భీమిలి నియోజకవర్గంలో 3,63,013 మంది ఓటర్లుండగా పురుషులు 1,78,090కాగా మహిళలు 1,84,908, ఇతరులు 15 మంది ఉన్నారు. వీరి కోసం 359 పోలింగ్ స్టేషన్లు ఎన్నికల నిర్వహణ అధికారులు ఏర్పాటు చేశారు. పోలింగ్ బూత్‌లలో లైటింగ్, విద్యుత్, తాగునీరు సౌకర్యం, టాయిలెట్లు, ఫర్నీచర్ తదితర ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలీస్ అధికారులు ఆయా బూత్‌లలో ఏర్పాట్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సాయంత్రం పోలింగ్ సిబ్బంది ఎన్నికలకు సంబంధించిన మెటీరియల్‌తో బస్సుల్లో కేంద్రాలకు చేరుకున్నారు. ఎన్నికల నియమావళికి సంబంధించి ఓటర్లు పాటించాల్సిన నియమ, నిబంధనలను బూత్‌ల వద్ద ప్రదర్శించారు. చైతన్యవంతులైన ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకుని ప్రజలకు అందుబాటులో వుండే నాయకుడిని ఎన్నుకోవాలని మేధావులు, ప్రజాస్వామ్యవాదులు కోరుతున్నారు. అవినీతిపరులు, భూకబ్జాదారులకు ఓటుతోనే బుద్ధి చెప్పాలని కోరుతున్నారు.

– తగరపువలస / మధురవాడ / భీమునిపట్నం / పద్మనాభం



పోలింగ్ బూత్‌లోకి సెల్‌ఫోన్ అనుమతించరని నోటీసు

మొత్తం ఓటర్లు	3,63,013
పురుషులు	1,78,090
మహిళలు	1,84,908
ఇతరులు	15
పోలింగ్ కేంద్రాలు	359



పోలింగ్ కేంద్రం వద్ద సిబ్బంది, సాయుధ బలగాలు



ఎగువపేట పోలింగ్ బూత్ వద్ద ఏర్పాటు చేసిన టెంట్



భీమిలిలోని పోలింగ్ బూత్ వద్ద పోలీసులు



చంద్రంపాలెం హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రానికి సామగ్రితో వచ్చిన సిబ్బంది



సెంట్రల్ ఎక్సైజ్ కార్యాలయం వద్ద సిద్ధంగా పోలింగ్ బూత్



చంద్రంపాలెం హైస్కూల్‌లో పోలింగ్‌కి సిద్ధమవుతున్న సిబ్బంది



కృష్ణాపురంలో సిద్ధం చేసిన పోలింగ్ స్టేషన్

బాబు చీకటి పాలన వద్దే వద్దు



నాడు : చంద్రబాబు హయాంలో పింఛన్ల కోసం మూలకుద్దులో వేచి ఉన్న వృద్ధులు



నేడు : సీఎం జగన్ పాలనలో ఇంటి వద్దే పింఛన్ నగదు అందిస్తున్న వలంటీర్

- ఇంటి వద్దకే పింఛను అందిస్తున్న జగనే కావాలి
- స్పష్టం చేస్తున్న పింఛనుదారులు

తగరపువలస : చంద్రబాబు హయాంలో పింఛన్ల పంపిణీకి సంబంధించిన చీకటి రోజులను తలచుకుని అవ్వాతాతలు వణికిపోతున్నారు. రోజుల తరబడి పంచాయతీ, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ రూ.200 పింఛను కోసం ఎదురు చూసేవారిమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ ప్రతీ నెలా ఒకటో తేదీన వేకువజామునే ఇంటి గుమ్మం ముందుకు తీసుకొచ్చి పింఛను నగదు అందిస్తున్నారని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కడుపులో చల్ల కదలకుండా పింఛను అందుకుంటున్న అవ్వాతాతలను చూసి పచ్చమందకు కన్నుకుట్టిందని... ఎన్నికల కమిషన్, న్యాయస్థానాలను ఆశ్రయించి రెండు మాసాలుగా వలంటీర్లు పింఛను పంపిణీ చేయకూడదంటూ అడ్డు తగిలారని మండిపడుతున్నారు.

దీంతో అవ్వాతాతలు, దివ్యాంగులకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయని వాపోతున్నారు. ఎండల్లో పింఛను కోసం బ్యాంకులకు వెళ్లి పలువురు పింఛనుదారులు మృతి చెందారని గుర్తు చేసుకుంటున్నారు. పింఛనుదారులకు నరకయాతన చూపించే చంద్రబాబు వద్దే వద్దని... ఇంటి వద్దకే పింఛన్ల నగదు అందించే సీఎం జగనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ముక్తకంఠంతో పింఛనుదారులు పేర్కొన్నారు.



నాడు : టీడీపీ పాలనలో పింఛన్ల కోసం చిట్టివలసలో మండుటెండలో వేచి ఉన్న వృద్ధులు



నేడు : కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వృద్ధునికి పింఛను అందిస్తున్న వలంటీర్

ప్రజల ఉసురు చంద్రబాబుకు తగులుతుంది

తగరపువలస: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అడ్డుకునేందుకు ఎన్నికల కమిషన్, న్యాయస్థానాలను ఆశ్రయించిన చంద్రబాబుకు ప్రజల ఉసురు తగిలి తీరుతుందని వైఎస్సార్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కలిడి సురేష్‌బాబు అన్నారు. ఆదివారం ఆయన సంగివలసలో మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత చంద్రబాబు, పవన్ శాశ్వతంగా పొరుగు రాష్ట్రానికి మకాం మార్చేస్తారన్నారు. సీఎం వైఎస్ జగన్‌ను మారో మారు ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్లను హేళన చేసిన చంద్రబాబు ఎన్నికల సమయంలో బుజ్జగింపు మాటలు చూస్తుంటే ఊసరవెల్లి కూడా సిగ్గుతో చచ్చిపోతుందన్నారు. ఆల్ ఫ్రీ బాబుగా జగమెరిగిన చంద్రబాబు కోవిడ్ కంటే ప్రమాదకరమైన వ్యక్తి అన్నారు. అమరావతిలో ఉన్న సొంత సామాజిక వర్గ ప్రజల ఆస్తులు కాపాడటమే అతని ధ్యేయమన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం పట్టని చంద్రబాబును ప్రజలే దూరం పెడతారన్నారు. ఆయనతోపాటు ట్రస్ట్ సభ్యులు శ్రీరామమూర్తి, శ్రీనివాస్, విజయ్, ద్వారకానాథ్ రెడ్డి, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సురేష్‌బాబు